
# తాత్కాలిక సుఖాలు ఆదర్శం బాధలు



(మినీకథ)

"నమస్కారం బాబుగారూ"

పేపరులోంచి తలెత్తి చూశాను. ఎదురుగా రంగయ్య దైన్యం నిండిన చూపులతో దౌర్భాగ్యానికి ప్రతినిధిలా ఉన్నాడు.

"అమ్మాయి ఎలా ఉంది" ప్రశ్నించాను. ఆనాడు కన్న కొడుకనే విషయం కూడా మరచిపోయి ఆ అమ్మాయికి న్యాయం చేయగలిగాను కాబట్టే.... రంగయ్య వైపు ధైర్యంగా చూడగలుగుతున్నా ననిపించింది ఆ సమయంలో.

క్షణం మౌనం తర్వాత కుమిలి కుమిలి ఏడవ సాగాడు రంగయ్య.

"వాట్. రంగయ్యా..ఎందుకు? ఏమైంది....చెప్పు రంగయ్యా" ఆతృతను అణచుకోలేకపోయి, కుర్చీలోంచి లేచి ఎదురుగా నిలబడిఉన్న రంగయ్య ముఖంలోకి తీవ్రంగా చూస్తూ ప్రశ్నించాను.

రంగయ్య నుంచి జవాబులేదు. కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్న విషయం నేనుగమనించక పోలేదు. మనసు మూగగా 'రోది స్తున్న విషయం నేను పసికట్టక పోలేదు.

మూడోసారికేమో– నా ముఖంలోని ఆవేశాన్ని, కోపాన్ని చూసి "అమ్మాయి.... అమ్మాయి రాత్రి ఆత్మహత్య చేసుకోబోయింది బాబూ" అంటూ ముఖాన్ని కండువాలో దాచుకొని భోరుమన్నాడు.

నాకు ఎందుకో ఆసమయంలో ఓదార్చాలని పించలేదు. "ఎందుకు అసలు ఏంజరిగింది ఇంట్లో" తిరిగి ప్రశ్నించాను ఒక నిమిషం ఆగి.

"అమ్మాయి నెల తప్పిందట బాబు గారూ" కండువాలోనే ముఖం దాచుకొని జవాబిచ్చాడు.

మా ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలుతోంది. కానీ రంగయ్య గుండెల్లో భయంకరమైన జడివాన కరాళ నృత్యం చేస్తోందని ఆ సమయంలో రంగయ్య ముఖం చూసిన వారెవరైనా చెప్పగలరు.

నాకు పరిస్థితి అర్థమైంది. కానీ రంగయ్య నా వద్దకు వచ్చింది పరిస్థితి చెప్పి వెళ్ళడానికి కాదు గదా!

"భయపడకు రంగయ్యా! పరిష్కారం నెమ్మదిగా ఆలోచిస్తాం కదా. బాధ పడకు. అన్నట్టు అమ్మాయికి సంబంధాలు ఏమీ చూడలేదా?" రంగయ్య భుజం మీద చేయి వేస్తూ ఆప్యాయంగా ప్రశ్నించాను.

"ఇంకెక్కడి సంబంధాలు అయ్యా. చెరచబడిందని దాని ఫోటోలు పేపరుకెక్కడం తోనే దాని బతుకు బుగ్గిపాలయిందయ్యా" రంగయ్య గొంతు వణుకుతూనే ఉంది.

పరిస్థితి విషమించింది. దీనికి ఓ న్యాయమూర్తిగా కాకున్నా సాటి మానవుడిగా పరిష్కారం సూచించడం నా కర్తవ్యం. దీనికి కారణం నా కన్నకొడుకు కావటం వలన, నా విధి కూడా.

రంగయ్య రోదిస్తూనే వున్నాడు.

పరిష్కారం మాటలంత సులభతరమైనది కాదు కదా.

మా మధ్య గంట పైగానే నిశ్శబ్దం నాట్యమాడింది.

చాలా సేపటికి నా మనసులో ఒకే ఒక ఆలోచన. ఒకే పరిష్కారం. రంగయ్యకు తెలియపర్చాను. నచ్చచెప్పి పంపించాను.

ఆ తర్వాత పది రోజులకి సుధీర్‌కు, రోహిణికి వైభవంగా వివాహం జరిపించాను. మొన్ననే హనీమూన్‌కు ఊటీకి కూడా పంపించాను.

* * *

నా మనసు చాలా తేలిగ్గానూ, మహా ఆనందంగానూ ఉంది.

నా జన్మ సార్థకమయింది. న్యాయమూర్తి పదవికి నేను నిర్వచనం చెప్పగలిగాను. ఇది నేననటం కాదు. పత్రికలన్నీ ఏకమై ప్రశంసించిన మాటలు.

కన్న కొడుకనే విషయం కూడా తలచక ఓ గ్రాడ్యుయేట్ హరిజన యువతిని మానభంగం చేసినందుకు తొమ్మిది నెలలు ?క కారాగారశిక్ష విధించగలిగాను. ఆ యువతి తన కొడుకు వల్లనే గర్భవతి అయిందనగానే కులం, గోత్రం, డబ్బు, హోదా అన్నిటినీ వెలివేసి ఆ అమ్మాయిని తన కోడలిగా చేసుకొని చరిత్ర సృష్టించగలిగాను.

అప్పుడే పోస్టుమాన్ వచ్చి అందించిన ఉత్తరాల కట్టలో "ప్రేం, సుధీర్" అనే ఉత్తరం కనబడటంతో నా మనసు ఒక్క క్షణం పరవశించింది. మనసు రెపరెపలాడింది.

సుధీర్ ఏమి రాసి ఉంటాడో కూడా నాకు తెలుసు. తండ్రిగా, న్యాయమూర్తిగా తనను....

నాకు తెలియకుండానే నా కళ్ళు ఉత్తరం వెంటపడ్డాయి.

"మహారాజశ్రీ తండ్రి గార్కి– నమస్కారములు. కులం నుంచి డబ్బు వరకు ప్రతి విషయాన్ని భూతద్దం లోంచి చూసే మీరు రోహిణితో నా వివాహం జరిపించటం ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ ఉంది నాకు. కానీ కన్నకొడుకుగా ఓ నిజం చెప్పటం నా కనీస బాధ్యత. నేను మానభంగం చేశాననటం, రోహిణి గర్భవతి కావటం– కేవలం కట్టు కథలు. డబ్బు, హోదా, కులం లాంటి సంప్రదాయాల చూరులు పట్టుకొని వేలాడుతున్న మీరు, ప్రేమించుకున్నాం. మా వివాహం జరిపించండంటే మీరిచ్చే సమాధానం తెలిసే, కొద్ది శ్రమ తీసుకొని మా వివాహం మీ చేతుల మీదగానే జరిపించుకున్నాం. మమ్మల్ని సహృదయంతో అర్థం చేసుకొని, ఆశీర్వదించగలరనే ఆశిస్తున్నాం.

మీ

కుమారుడు

—సుధీ

ఉత్తరం చేతిలో రెప రెపలాడుతూనే ఉంది. అక్షరాలు మాత్రం – వేటాడే చురకత్తుల్లా పైపైకి చూస్తున్నాయి. *